ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

16+4

శుక్రవారం 27 ఏప్రిల్ 2018


# ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలు లేవు

- ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్

**జేఎన్టీయూకే, ఏప్రిల్ 26:** ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలు లేవని నాస్కామ్ సర్వేలో ప్రకటించారని ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ తెలిపారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఇంజనీరింగ్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్ కాకినాడ(ఎకోశాక్) ఆధ్వర్యంలో బీటెక్, బీఫార్మసీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకోశాక్ అధ్యక్షుడు జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉదయభాస్కర్ మాట్లాడుతూ అధ్యాపకులు ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠ్యాంశాలను నేర్పించడమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా నేర్పించాలని సూచించారు. జేఎన్టీయూకేలో చదివే విద్యార్థులలో 20 నుంచి 30 శాతం మంది వినూత్న నైపుణ్యాలను కలిగి ఉంటారన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగాలకు 70 శాతం మంది ఇంజనీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నారని తెలిపారు. ఎవరికివారే తమలోపాలను సరిదిద్దుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యత కలిగి, సేవచేసే తత్వం కలిగినవారే ప్రభుత్వ ఉద్యోగాలకు రావాలని, వారికే సమాజాన్ని మార్చే అవకాశం ఎంతో ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉందని ఆన్‌లైన్ ద్వారానే నేర్చుకోగల అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతతీ విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, క్రీడా విభాగాలను ఎంపిక చేసుకుని నిరూపించుకోగలిగితే వారికి అదనంగా రెండు క్రెడిట్స్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ పూర్ణానందం, రిజిస్ట్రార్ సుబ్బారావు, ఎకోశాక్ జనరల్ సెక్రటరీ పి.సుబ్బారావు, పలువురు డైరెక్టర్లు, ప్రోగ్రాం డైరెక్టర్లు పాల్గొన్నారు.




జేఎన్టీయూకేలో విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయభాస్కర్

## సిద్ధాంత వ్యాసాలకు పీహెచ్‌డీలుగా ఆమోదం

**జేఎన్టీయూకే, ఏప్రిల్ 26:** పరిశీలకుల బృందం సిఫార్సుల మేరకు టి.వెంకటనారాయణరావు, ఎన్.అనుపమ, వి.శ్రీనివాసరావు సిద్ధాంత వ్యాసాలకు పీహెచ్‌డీలుగా జేఎన్టీయూకే ఆమోదముద్ర లభించినట్లు వర్సిటీ పీఆర్వో ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు తెలిపారు. వెంకటనారాయణరావు అనుపమలకు సీఎస్ఈ విభాగంలోను, శ్రీనివాసరావుకు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలోను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డులు లభించాయన్నారు. వెంకటనారాయణరావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగంలో ప్రొఫెసర్‌గానూ, అనుపమ గుంటూరు ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గాను, శ్రీనివాసరావు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గాను విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.